Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో.. ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
PRAJA TELEVISION
The People's Favour
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు. నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 25 | సంచిక : 161 | హైదరాబాద్ | మంగళవారం 17 జూన్ 2025 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## సివిల్ వివాదాల్లో జోక్యం మానరా?

### 30 పిటిషన్‌లలో 25 అవే ఉంటున్నాయ్

- కోర్టులో పెండింగ్ ఉంటే మీరెలా ఆదేశాలిస్తారు?
- పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యంపై హైకోర్టు సోమవారం మరోసారి అసహనం వ్యక్తంచేసింది. ఎన్నిసార్లు చెప్పినా తీరు మారడంలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. "హైకోర్టులో పోలీసులపై 30 పిటిషన్‌లు దాఖలవుతుంటే వాటిలో 25 సివిల్ వివాదాల్లో జోక్యానికి సంబంధించినవే ఉంటున్నాయి. సివిల్ కోర్టుల్లో ఉన్న వివాదాల్లో మీరెందుకు జోక్యం చేసుకుంటున్నారు? అన్ని పనులను మీరే చేస్తే మంచిది. కోర్టులపై భారం కూడా ఉండదు. ఇళ్లు, స్థలాలను ఖాళీ చేయించడం, రెంట్ కంట్రోల్ యాక్ట్ బాధ్యతలన్నీ మీకే అప్పగించేలా

- మిగతా 2వ పేజీలో




### రైతు పెట్టుబడికి

# రెండింతలు రావాలి

- అప్పుడే పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం
- 9 రోజుల్లో అన్నదాతల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతుభరోసా నిధులు జమ చేస్తాం
- గత ప్రభుత్వానిది ఆర్థిక విధ్వంసం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రైతునేస్తం కార్యక్రమంలో బటన్ నొక్కి 'భరోసా' నిధులను విడుదల చేసిన సీఎం

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్



రాష్ట్రం మరో వందేళ్లయినా కోలుకోనివిధంగా గత భారాస ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో విధ్వంసం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. విద్యార్థులు, రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రతిపక్షాలు సంతోషంతో నృత్యాలు చేస్తున్నాయని, వారి చావులపై అధికారంలోకి రావచ్చున్న దురాశతో పనిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఎన్ని కష్టాలు ఉన్నా.. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశంతో రైతుభరోసా పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల్లో 1.49 కోట్ల ఎకరాలకు... 70.11 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేస్తామని చెప్పారు. తెలంగాణను

- మిగతా 2వ పేజీలో



## రాష్ట్రంలో వైద్య కళాశాలల భవితవ్యాన్ని కాపాడండి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

భారాస ప్రభుత్వం ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం రేవంత్ పాలనలో ప్రశ్నార్థకంగా మారుతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. "26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సౌకర్యాలు, వసతులు నిబంధనలకు అనుగుణంగా లేవని, ఈ నెల 18న హెల్త్ సెక్రటరీ, డీఎంఈలు తమ ముందు ప్రత్యక్షంగా హాజరు కావాలని ఎన్ఎంసీ తాఖీదులు ఇవ్వడం ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం. ముఖ్యమైన ఈ విషయంపై ఆలస్యంగా మేల్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు కమిటీ వేయడం హాస్యాస్పదం. ముఖ్యమంత్రి పరిపాలనను గాలికి వదిలేసి.. ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారు. వందల మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు భరోసా? ఇప్పటికైనా తక్షణమే మెడికల్ కళాశాలలకు కావాల్సిన నిధులను విడుదల చేయాలి" అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

## లబ్ధిదారు నేతృత్వంలో నిర్మాణం..

### 69 వేల అసంపూర్తి రెండు పడక గదుల ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున సాయం

మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్



అసంపూర్తిగా ఉన్న 69 వేల రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారు నేతృత్వంలో నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో పూర్తిచేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం ఆయా లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో సచివాలయంలో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. "గత ప్రభుత్వం పదేళ్లలో 60 వేల ఇళ్లను మాత్రమే అరకొరగా పూర్తిచేసింది. తాగునీరు,

- మిగతా 2వ పేజీలో



## ప్రభుత్వం నిధులెందుకు చెల్లించింది?

### ఎఫ్ఈవోతో ఎవరెవరు సమావేశమయ్యారు?

- ఫార్ములా-ఈ రేస్ కేసులో కేటీఆర్‌పై అనిశా ప్రశ్నలు
- ఎనిమిది గంటలపాటు సుదీర్ఘ విచారణ
- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలంటూ ఆదే

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి, భారాస కార్యని ర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు సోమవారం ఎనిమిది గంటలపాటు సుదీర్ఘ విచార ణ చేశారు.

ఈసారి ప్రధానంగా ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థతో పరిచయం, రేసు నిర్వహణ కోసం జరిగి న ఉత్తర ప్రత్యుత్తరాలు, నిధుల చెల్లింపుల వంటి అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదే కేసులో కేటీఆర్‌ను జనవరి 9న అనిశా అధికారులు విచారించిన విషయం తెలిసిందే. అనంతరం... రేస్ నిర్వహణపై ఎఫ్ఈవో ప్రతినిధులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెండుసార్లు విచారించారు. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగానే సోమవారం కేటీఆర్‌పై విచారణ సాగినట్లు తెలుస్తోంది. కేటీఆర్ వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అధికారులు అవసరమైతే

- మిగతా 2వ పేజీలో

# కృష్ణమ్మ కదలాలి.. గోదారి పారాలి

### రెండు బేసిన్లలోని ప్రాజెక్టులకు 641.68 టీఎంసీలు అవసరం

కృష్ణా పరీవాహకంలో స్వల్పంగా ప్రవాహాలు ప్రారంభం

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్



కృష్ణా, గోదావరి పరీవాహకాల్లో ప్రాజెక్టులు నోళ్లు తెరుచుకుని చూస్తున్నాయి. రెండు బేసిన్లలోని ప్రాజెక్టులు మొత్తం 641.68 టీఎంసీల మేర ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో కృష్ణా పరీవాహకంలో స్వల్పంగా ప్రవాహాలు మొదలైనా గోదావరిలో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. కృష్ణా పరీవాహకంలోని మొత్తం 8 ప్రాజెక్టుల్లో 499.06 టీఎంసీల ఖాళీ ఉంది. కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో వర్షాలకు నదిలో స్వల్పంగా ప్రవాహం వస్తోంది. ఇటీవల జూరాల నిండింది. నారాయణపూర్ కూడా నిండటానికి సమీపంలో ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి జూరాల వైపునకు స్వల్పంగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇక మిగిలిన ప్రాజెక్టులన్నింటిలోనూ నీళ్లు అడుక్కు చేరాయి. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్‌లకు మరో 70 టీఎంసీలకుపైగా వచ్చి చేరితేనే గానీ దిగువకు పెద్ద ఎత్తున ప్రవాహం విడుదల కాదు. తుంగభద్ర నదిలోనూ సుంకేశుల బ్యారేజీ దిగువన ప్రవాహం ఉంది. అయితే, గతేడాది జూన్ 16వ తేదీతో పోల్చితే నిల్వలు కాస్త మెరుగ్గానే కనిపిస్తున్నాయి. ఏడాది క్రితం శ్రీశైలంలో 35.43 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 64.05 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 122.52 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 137.36 టీఎంసీల నిల్వ ఉంది. గోదావరి పరీవాహకంలో ప్రాజెక్టులన్నీ అడుగంటి పోయాయి. 8 ప్రాజెక్టుల్లో (జూక్వాడీ మినహా) 142.62 టీఎంసీల ఖాళీ ఉంది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్ ప్రాజెక్టులో 66.67 టీఎంసీల ఖాళీ ఉంది. వర్షాలు ముందుగా వచ్చినా.. గోదావరి పరీవాహకంలో మాత్రం ప్రవాహాలు లేవు. గతేడాది ఇదే సమయానికి ఎస్సారెస్పీలో 7.83 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 13.83 టీఎంసీలు ఉన్నాయి.



## పోలవరం 'టీవోఆర్'ను అడ్డుకోండి

### కేంద్ర మంత్రికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

పోలవరం-బనకచర్ల ద్వారా గోదావరి జలాల మళ్లింపు కోసం ప్రాజెక్టు టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్)లో ఏపీ చేసిన మార్పులను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్

- మిగతా 2వ పేజీలో

# రైతు పెట్టుబడికి రెండింతలు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో నం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని అన్నారు. రైతుల పెట్టుబడికి రెండింతల లాభం వచ్చినపుడే రానున్న పదేళ్లలో రాష్ట్రం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. సోమవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని... రైతుభరోసా నిధుల విడుదలను బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



"రుణమాఫీ, రైతుభరోసా, ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్లు, రైతుబీమా, సన్న ధాన్యానికి బోనస్ కింద గడిచిన 18 నెలల్లో రైతుల కోసం ప్రభుత్వం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు పెట్టింది. భారాస హయాంలో రుణమాఫీ ఎంత జరిగింది? ఏడాదిలో మేం ఎంత మాఫీ చేశామో గ్రామాల్లో చర్చలు పెడతాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీ కేంద్రాలు తెరవలేదు. మేం 8 వేల కేంద్రాలు తెరిచి, 48 గంటల్లో నగదు బదిలీ చేయడంతోపాటు బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం ధరణి పేరిట దోపిడీ చేస్తే.. భూభారతితో పొంగులేటి అండగా ఉన్నారు. గతంలో ప్రభుత్వాన్ని నడిపినవాళ్లే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఏర్పాటై 18 నెలలు తిరగకముందే నిందిస్తూ... వీధి నాటకాలతో బయలుదేరారు. వారు 2014లో రూ.లక్ష రుణమాఫీని నాలుగు విడతల్లో చేస్తే అసలుకు వడ్డీలు పెరిగాయి తప్ప రైతులకు ఏమీ మిగల్లేదు. 2018లో ఒకేసారి చేస్తామని చెప్పి ఐదేళ్ల తర్వాత రూ.11,500 కోట్లు రుణమాఫీ చేశారు. వాటిలో రూ.8,500 కోట్లు వడ్డీకి సరిపోయాయి. గత ప్రభుత్వం రెండు విడతల్లో చేసిన రుణమాఫీ రూ.16-17 వేల కోట్లకు మించలేదు. మా ప్రభుత్వానికి తొలి ఏడాదిలో ఎన్నో ఇబ్బందులున్నా ఒకేసారి రుణమాఫీ చేశాం.

రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం ఇస్తే మిల్లర్లు కొంటున్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సన్న వడ్లు పండించాలని, క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని రైతులకు విజ్ఞప్తి చేశాం. దీంతో గత వానాకాలం సీజన్‌లో 60 శాతం సన్న వడ్లు పండించారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం పేదల కడుపు నింపుతోంది. రైతుల పంటలు కొనుగోలు చేస్తే రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని, ప్రభుత్వం సత్రం నడపడం లేదని అప్పటి సీఎం అన్నారు. వరి వేస్తే ఉరివేసుకున్నట్లేనన్నారు. స్వయంగా తన 150 ఎకరాల్లో వడ్లు పండించి క్వింటాలుకు రూ.4,200 చొప్పున విక్రయించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు వరి పండిస్తే ప్రభుత్వమే కొంటుందని మేం చెప్పాం. దీంతో 2.2 లక్షల టన్నుల వడ్లు పండించి దేశంలోనే తొలి స్థానంలో నిలిచారు. సన్న వడ్లు పండించడంలోనూ అగ్రస్థానం మనదే. ఇంతకన్నా రైతుల కళ్లలో ఆనందం ఏముంటుంది?

### రూ.8.29 లక్షల అప్పులు మోపారు..

బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చేనాటికి వారి పదవీకాలం ముగిసిపోయింది. గత ప్రభుత్వం రూ.1.29 లక్షల కోట్ల బిల్లులను చెల్లించలేదు. ఇందులో రూ.60 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సినవి కాగా... రూ.20 వేల కోట్లు ఉచిత విద్యుత్తు బిల్లులవి. గత ప్రభుత్వం రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదు. ప్రభుత్వ ఉద్యోగులకే రూ.12 వేల కోట్ల బకాయి పెట్టింది. రూ.8.29 లక్షల కోట్ల అప్పు మిగిల్చి ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు రోజుకు 18 గంటలు పనిచేసినా సరిపోని పరిస్థితి. ఫీజు రీయింబర్స్‌మెంట్, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి అమలు కష్టంగా ఉంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితి.

### 4 కోట్ల మందికి స్వేచ్ఛ వచ్చింది...

ట్యాపింగ్ కారణంగా గతంలో భార్యాభర్తలు ఫోన్‌లో మాట్లాడుకోవాలన్నా భయపడే పరిస్థితులుండేవి. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు కోట్ల మంది ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. కులగణన, ఎస్సీ వర్గీకరణ చేశాం. మా ప్రభుత్వంలో ఐదుగురు ఎస్సీలు మంత్రులు, స్పీకర్‌గా ఉన్నారు. గతంలో ఉన్నది ఒక్కరే. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. సివిల్స్ చదివే రైతుల పిల్లలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నాం.

రాష్ట్రంలో పరిశ్రమలకు రాయితీలు, భూములు ఇచ్చినట్టు... రైతులకు సబ్సిడీ ఇవ్వడంతోపాటు ఏఐపై అవగాహన కల్పించాలి. రైతులకు వ్యవసాయ పరికరాలు అందించి, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం. కుటుంబంలో నలుగురు ఉంటే.. ఒకరు వ్యవసాయం, ఒకరు ఇంటి పనులు, ఒకరు ఉద్యోగం, మరొకరు వ్యాపారం చేస్తే ఆర్థికంగా నిలబడుతుంది. రైతులకు ఏటా రూ.17 వేల కోట్ల విలువైన ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. వారందరూ సౌర విద్యుత్‌కు మారితే అదనంగా నెలకు రూ.2-3 వేల ఆదాయం వచ్చేలా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు ఇంటివద్ద కూర్చున్నా ఆదాయం వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని, సోలార్ పంపుసెట్లతో ప్రయోజనంపై వారికి అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తున్నా. ఏ భూమిలో ఏయే రకాల పంటలు, పండ్లు, కూరగాయలు వేయాలన్న విషయమై రైతులకు అవగాహన కల్పించాలి. అనుభవమున్నవారితో సదస్సులు నిర్వహించాలి. వారికి రోజుకు రూ.వెయ్యి గౌరవ భత్యం ఇవ్వాలి. కొడంగల్, తాండూరులలో కందిపప్పు, అచ్చంపేటలో దోసకాయలు పండుతాయి. దోసకాయ, కందిపప్పుతో వండిన కూరతో జొన్న రొట్టె తింటే చాలా బాగుండేది. ఇప్పుడు ఆ రుచులు పోయాయి. ఇప్పుడు తింటున్న మిల్లెట్స్ మన తాతముత్తాతలు తిన్నవి కాదా? జిమ్‌లకు వెళ్లి, స్టెరాయిడ్‌లు తీసుకుని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు. జొన్నరొట్టెలు తిని.. ఎవరి దుస్తులు వారు ఉతుక్కుంటే సిక్స్‌ప్యాక్ వస్తుంది.

### ఊర్లో ఇల్లు, పొలం రైతుకు గౌరవం..

ఊర్లో ఇల్లు, వ్యవసాయ భూమి ఉంటే రైతులకు ఆత్మగౌరవం. రాష్ట్రంలో రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది. వారు పంట మార్పిడి చేయాలి. ఏ పంట పండించినా కొంటాం. ప్రభుత్వంలో మంత్రులతో మంచి జట్టు ఉంది. అనుభవమున్నవారు ఉన్నారు. అందరి సహకారంతో మంచి పరిపాలన అందిస్తాం. ప్రతిపక్షాలు ఎంత గోల పెట్టినా, ధర్నాలు చేసినా పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నవారు రైతుభరోసా, గిట్టుబాటు ధర, సర్పంచుల బిల్లులు ఎందుకు చెల్లించలేదు? ప్రతిపక్షాల తిట్లన్నీ మాకు ఆశీర్వాదం అవుతాయి. నేను ప్రజాసంక్షేమం కోసమే పనిచేస్తా. ఇక రైతులు, యువత ప్రతిపక్షాల పనిపట్టాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

# తెలంగాణ స్కిల్స్ వర్సిటీకి సహకరిస్తాం

## కేంద్ర మంత్రి జయంత్ చౌధరి

ప్రజాతీర్పు ప్రతినిధి, నారాయణగూడ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలవాలంటే ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం అత్యవసరమని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌధరి అన్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీజీ లా కళాశాలలో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్(తెలంగాణ)ల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ నిర్వహణలో ఏర్పాటు చేసిన మెగా జాబ్, లోన్ మేళాను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయంత్ చౌధరి మాట్లాడుతూ.. ఎంబీఏ చదివినవారు కూడా నాలుగో తరగతి స్థాయి ఉద్యోగాలు చేయడానికి వెనుకాడటం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్స్ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణను 'స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబల్'గా మార్చాలనే సంకల్పంతో




సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి కేంద్రంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్‌కుమార్, మేళా నిర్వహణ ప్రతినిధి ఇందిరా, లా కళాశాల మాజీ ప్రిన్సిపల్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిధులెందుకు చెల్లించింది?

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి పిలుస్తామని చెప్పి పంపించి వేశారు. ఆయన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఉపయోగించిన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను అప్పగించాలని ఆదేశించినట్లు సమాచారం. అంతకుముందు కేటీఆర్ ఉదయం 10 గంటల సమయంలో తన న్యాయవాది పూర్ణచంద్రరావుతో కలిసి అనిశా కార్యాలయానికి చేరుకున్నారు. న్యాయవాదిని విచారణ గదిలోకి అనుమతించలేదు. కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్‌ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణను ఎస్పీ రితిరాజ్, డైరెక్టర్ తరుణ్‌జోషి పర్యవేక్షించారు. ముందుగా సిద్ధం చేసుకున్న ప్రశ్నావళి ప్రకారం కేటీఆర్‌ను విచారించినట్లు సమాచారం. కారు రేసు నిర్వహణ కోసం ఎఫ్‌ఈవోకు అప్పటి భారాస ప్రభుత్వం పన్నులతో కలిపి దాదాపు రూ.55 కోట్లు చెల్లించింది. ఆర్థికశాఖ అనుమతి లేకుండా, ఆర్బీఐకి సమాచారం ఇవ్వకుండా విదేశీ సంస్థకు నేరుగా నిధులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందని అడిగినప్పుడు సమయాభావం కారణంగానే అలా చేయాల్సి వచ్చిందని కేటీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. స్పాన్సర్లు ఉండగా ప్రభుత్వమే ఎందుకు నిధులు చెల్లించిందని అడిగినప్పుడు స్పాన్సర్‌గా ఉన్న ఏస్‌నెక్స్ట్‌జెన్ అర్ధంతరంగా తప్పుకొందని, మరో సంస్థను వెతికే సమయం లేకపోవడం, రేసు ఆగిపోకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం రంగంలోకిదిగి మిగతా ప్రక్రియను కొనసాగించిందని చెప్పినట్లు సమాచారం. తన అనుమతితోనే ఈ నిధులను చెల్లించినట్లు కూడా కేటీఆర్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.



ఎఫ్‌ఈవో ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఎవరెవరు పాల్గొన్నారు... ఎన్నిసార్లు సమావేశమయ్యారు... ఉత్తర ప్రత్యుత్తరాలు ఎలా జరిగాయి... వంటి ప్రశ్నలనూ కేటీఆర్‌పై సంధించినట్లు తెలుస్తోంది. ఎఫ్‌ఈవోతో ఈ-మెయిల్ సంప్రదింపులు ఎలా జరిపారని అడిగిన ప్రశ్నకు... అంతా తన సెల్‌ఫోన్ ద్వారానే నిర్వహించానని, ప్రభుత్వానికి చెందిన కంప్యూటర్, ల్యాప్‌టాప్ వాడలేదని ఆయన చెప్పినట్లు సమాచారం. దాంతో 2021 జనవరి నుంచి 2023 డిసెంబరు వరకు వాడిన సెల్‌ఫోన్‌తోపాటు ల్యాప్‌టాప్‌లను తమకు అప్పగించాలని అధికారులు కోరగా... కేటీఆర్ అంగీకరించినట్లు సమాచారం. దాదాపు ఎనిమిది గంటలపాటు రెండు, మూడు విడతలుగా ఆయనను ప్రశ్నించారు. మధ్యలో భోజన విరామమిచ్చారు. విచారణ తతంగం మొత్తాన్నీ వీడియో చిత్రీకరించారు. ఆయన చెప్పిన వివరాలను నమోదు చేసి సంతకం తీసుకున్న తర్వాత విచారణ ముగిసిందని, అవసరమైతే మరోమారు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పి కేటీఆర్‌ను పంపించారు. అక్కడ నుంచి నేరుగా కేటీఆర్ భారాస కార్యాలయానికి చేరుకున్నారు.

### అదే దారిలో ముఖ్యమంత్రి... భారీ బందోబస్తు

కేటీఆర్ విచారణ నేపథ్యంలో అనిశా కార్యాలయం చుట్టూ పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. బందోబస్తును బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు. భారాస శ్రేణులు భారీగా తరలివచ్చే అవకాశమున్నట్లు తెలియడంతో... అనిశా కార్యాలయానికి దారితీసే రోడ్లపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎంబీటీనగర్ నుంచి వెళ్లే వాహనాలను పూర్తిగా మళ్లించారు. ఉదయం 10 గంటల సమయంలో కేటీఆర్ తన కారులో అనిశా కార్యాలయానికి చేరుకున్నారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తల వాహనాలను మాత్రం పోలీసులు అనుమతించలేదు. దాంతో చాలామంది కార్యకర్తలు నడుచుకుంటూనే అనిశా కార్యాలయం వద్ద ఉన్న ఒక హోటల్‌కు చేరుకున్నారు. ఫలితంగా కమాండ్ కంట్రోల్‌కు దారితీసే రోడ్లు రద్దీగా మారాయి. ఇదే దారిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రావాల్సి ఉండటంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు అక్కడున్న కార్యకర్తలను పంపించి వేశారు. హోటల్‌ను మూసివేయించి అందులో ఉన్న వారందర్నీ బయటకు పంపించారు. మధ్యాహ్నం 12.40 సమయంలో ముఖ్యమంత్రి... కమాండ్ కంట్రోల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ తర్వాత హోటల్‌ను తెరుచుకునేందుకు పోలీసులు అనుమతించారు.



# పోలవరం 'టీవోఆర్'ను అడ్డుకోండి

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్‌కు ఆయన సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'బనకచర్ల ప్రాజెక్టు చేపట్టడం ద్వారా ఏపీ పర్యావరణ అనుమతులతో పాటు ట్రైబ్యునల్ నిబంధనలను ఉల్లంఘిస్తోంది. ఇది ముమ్మాటికీ పొరుగు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలిగించడమే. గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్‌తో పాటు సాంకేతిక సలహా మండలి(టీఏసీ) సూచనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. కేంద్ర పర్యావరణశాఖ నుంచి 2005 అక్టోబరు 25న పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభించింది. అనంతర కాలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రాజెక్టులో ఏపీ భారీ మార్పులు చేసింది. ఆ పనులు నిలిపివేయాలంటూ కేంద్రం 2011 ఫిబ్రవరి 8న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వచ్చే ఏడాది జులై 2 వరకు పొడిగించాలి. కీలకమైన అంశాలపై కేంద్ర జలశక్తి, పర్యావరణ మంత్రిత్వ శాఖలు సంబంధిత పక్షాలతో సమావేశం నిర్వహించి చర్చించాలి. ప్రాజెక్టు నిర్మాణం కోసం మొదట ఆమోదించిన ప్రమాణాలను కేంద్రమే ఉల్లంఘిస్తోంది. కుడి కాలువ హెడ్ స్లూయిస్ నీటి విడుదల సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచారు. కుడి కాలువలో 11,654 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి డీపీఆర్‌కు ఆమోదం లభించగా.. 17,560 క్యూసెక్కులతో నిర్మిస్తున్నారు. ఎడమ కాలువను కూడా సామర్థ్యానికి మించి నిర్మిస్తున్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ(ఈఏసీ) తిరస్కరించాలి" అని లేఖలో ఉత్తమ్ డిమాండ్ చేశారు.

### గోదావరి-బనకచర్లకు హరీశ్‌రావు మద్దతు ఇస్తున్నారా?

ఏపీ అక్రమంగా చేపడుతున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు హరీశ్‌రావు మద్దతు ఇస్తున్నారా అని మంత్రి ఉత్తమ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'ఆదివారం హరీశ్‌రావు నాకు రాసిన లేఖలో పేర్కొన్న విషయాలు చూస్తోంటే ఆ ప్రాజెక్టుకు ఆయన మద్దతు ఇస్తున్నట్లు ఉంది. గోదావరి మళ్లింపు జలాలతో కృష్ణా జలాల్లో 112.5 టీఎంసీల వాటా పొందాలంటూ హరీశ్ సూచన చేశారు. ఇది పూర్తిగా తప్పుడు ఆలోచన. ఎగువ రాష్ట్రాలకు వాటాల కల్పన నికర జలాలకు మాత్రమే వర్తిస్తుంది. వరద నీటికి కాదు. కృష్ణా జలాల్లో 68.5 శాతం వాటా, పోలవరం మళ్లింపుతో వచ్చే వాటా కోసం కేడబ్ల్యూడీటీ-2 ఎదుట కాం గ్రె స్ ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపిస్తోంది. తెలంగాణ ప్రయోజనాల కోసం కాకుండా... రాజకీయఉద్దేశంతో హరీశ్ వ్యవరిస్తున్నారు' అనిఉత్తమ్ విమర్శించారు.

# సివిల్ వివాదాల్లో జోక్యం మానరా?

(మొదటి పేజీ తరువాయి)



వచ్చే శాసనసభ సమావేశాల్లో చట్టాన్ని సవరించాలని ప్రభుత్వానికి చెప్పండి. విల్లు, గిఫ్ట్‌డీడ్‌ల అమలులోనూ మీ జోక్యం ఉంటోంది" అని వ్యాఖ్యానించింది. హైదరాబాద్ బార్కాస్‌లోని 256 గజాల ఇంటి స్థలానికి సంబంధించి సివిల్ కోర్టులో వేసిన దావాను ఉపసంహరించుకోవాలని పోలీసులు తమను బెదిరిస్తున్నారంటూ మొహిసిన్ బఫానా హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ మొహిసిన్ సోదరుడు సలాం బిన్ సయీద్ బఫానా ఒత్తిడితో పోలీసులు తమ క్లయింట్‌ను బెదిరిస్తున్నారన్నారు. హోంశాఖ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... దాడి జరిగినట్లు తమకు ఫిర్యాదు అందడంతోనే కేసు నమోదు చేశామన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ... "సివిల్ కోర్టులో దావాను ఉపసంహరించుకోవాలని ఎలా చెబుతారు? పోలీసులు ప్రజల్లో విశ్వాసం నింపడంలో విఫలమవుతున్నారు. వారిని చూస్తే ఏ తప్పు చేయని సామాన్యులూ భయపడుతున్నారు. ఖరీదైన ప్రాంతంలో ఉన్న గచ్చిబౌలి ఠాణాలోనూ స్టేషనరీ తెచ్చివ్వాలని పోలీసులు అడిగినట్లు ఓ వ్యక్తి మాకు చెప్పారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమిక విచారణ లేకుండా తక్షణం న్యాయం చేయాలని చూస్తారు. పోలీసు చట్టంలోని సెక్షన్ 19... పోలీసు విధులేంటో చెబుతోంది. మీరు వాటిని దాటి కొత్త పాత్రలు పోషిస్తున్నారు. పోలీసుల విధులకు సంబంధించి 2002లోనే ఇదే హైకోర్టు స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసినా పట్టించుకోవడంలేదు. సివిల్ వివాదానికి సంబంధించి ఫిర్యాదు వస్తే సివిల్ కోర్టును ఆశ్రయించాలంటూ సలహా ఇచ్చి పంపాలి. ఈ దావాలో ఎస్‌హెచ్‌వోపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు మేం ఎందుకు ఆదేశాలు జారీ చేయరాదు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాది సమాధానమిస్తూ... పోలీసులు సివిల్ వివాదంలో జోక్యం చేసుకోరని, ఫిర్యాదు నమోదైనందున చట్టప్రకారం దర్యాప్తు చేస్తారని హామీ ఇచ్చారు. దీంతో న్యాయమూర్తి పిటిషన్‌పై విచారణను మూసివేస్తూ పోలీసులు దాడికి సంబంధించిన క్రిమినల్ కేసుపైనే దర్యాప్తు చేపట్టాలని ఉత్తర్వులిచ్చారు.

# లబ్ధిదారు నేతృత్వంలో నిర్మాణం..

(మొదటి పేజీ తరువాయి)

సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు పడక గదుల ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాం. అసంపూర్తిగా ఉన్న 1.61 లక్షల ఇళ్లకు రూ.640 కోట్లు ఖర్చు చేశాం. 98 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాం. మిగిలిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తాం. మరో 69 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని బీఎల్‌సీ (బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో పూర్తి చేస్తాం. ఈ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలి" అని పొంగులేటి సూచించారు.

### 2.65 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు..

'ఈ ఏడాది 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం రూ.22,500 కోట్లు ఖర్చు చేయనున్నాం. ఇప్పటివరకు 2.65 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాం. ఇందులో 71 వేల ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 3 వేల ఇళ్లు గోడలు, స్లాబ్ వరకు పూర్తయ్యాయి" అని మంత్రి పేర్కొన్నారు.

# కమ్యూనిస్టు విలువలు సోషలిస్టు భావాలు విస్తృత పరచాలి

- మార్క్సిజమే మానవాళి విముక్తి కి మార్గం
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు



**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 16**
ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కొనసాగుతుందని తద్వారా పేదరికం నిరుద్యోగం, దారిద్ర్యం ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఎర్రజెండా పోరాడుతున్నదని భవిష్యత్తు ఎర్రజెండాదేనని నేటి యువతరం కమ్యూనిస్టు విలువలు సోషలిస్టు భావాలను అలవర్చుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత వస్త్ర పరిశ్రమ భవన్ లో జరుగుచున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లోబాగంగా సోమవారం కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కర్తవ్యాలు అనే అంశం పై క్లాసు బోధించారు.ఆయన మాట్లాడుతూ ఎర్రజెండా పని అయిపోయిందని,సోషలిజం ఇక లేదని,ఇజాలకు కాలం చెల్లిందని, అనే మాట పాతదని,ఈ కాలంలో మళ్ళీ కమ్యూనిజం ఆలోచనలు, సోషలిజం భావాలు కమ్యూనిస్టు భావాలు క్రమక్రమంగా ప్రపంచంలో పెరుగుతున్నాయన్నరు. సోషలిస్టు దేశాలుగా ఉన్న చైనా, క్యూబా, వియత్నం, ఉత్తర కొరియా, లావోస్ దేశాలు అమెరికన్ సామ్రాజ్యవాదం యొక్క ఒత్తిళ్లకు తలొగ్గకుండా దీటుగా నిలబడి పోరాడుతున్నాయన్నారు. చైనా అమెరికాను మించిపోతుందని అమెరికా బెంబేలు ఎత్తుతున్నదని అన్నారు. ఏకధృవ ప్రపంచం గా ఉన్న స్థితి నుంచి బహుళ ధ్రువ ప్రపంచంగా ప్రపంచం మారుతుందన్నారు . లాటిన్ అమెరికా దేశాలలో ఎన్నికల ద్వారా వామపక్షాలు విజయం సాధిస్తున్నాయని చెప్పారు. క్యూబా పై ఎన్ని ఆంక్షలు పెట్టినా సోషలిజం ముందుకు పోతున్నదని స్థిరంగా అభివృద్ధి సాధిస్తుందని వివరించారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ప్రపంచమంతా ఆర్థిక అసమానతలు పెంచాయని వాటికి వ్యతిరేకంగా ప్రతిఘటన అదే తీరులో ఉన్నదని అమెరికా కు ప్రతిఘటన సాగుతుందని అన్నారు. భారతదేశంలో సిపిఎం 24వ మహాసభ రాజకీయ తీర్మానం కర్తవ్యాల పైన వివరించారు. నయా ఉదారవాద విధానాలకు, హిందుత్వ మతోన్మాదానికి ,ప్రజాస్వామ్యంపై, నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా సిపిఎం పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమాలకు సిద్ధం కావాలని పోరాటాలను ఉధృతంగా సాగించాలన్నారు. ప్రజల మనుగడ కోసం ఎదురయ్యే సమస్యలపై భూమి, ఆహారం, వేతనాలు, ఇళ్ల స్థలాలు ,సామాజిక భద్రతా ప్రయోజనాలు ,ఉపాధి అవకాశాలు వంటి సమస్యలపై గ్రామీణ పేదల శ్రామిక వర్గ పట్టణ పేదల పోరాటాలను పెంపొందించి పార్టీ వాటిని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కులు, పౌరహక్కుల రక్షణకు అనుకూలంగా పార్టీ ఉద్యమించి%శీ%దన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థలను దెబ్బతీయడానికి వ్యతిరేకంగా విశాల ఐక్యతను నిర్మించడానికి సీపీఎం కృషి చేస్తుందన్నారు. అన్ని రూపాల కుల అనిచివేతకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాన్ని పార్టీ చురుకుగా చేపట్టాలని పిలుపునిచ్చారు. మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీ మతస్తుల హక్కుల రక్షణలో, సిపిఎం మెనగాడిలా నిలబడుతుందన్నారు.మోడీ ప్రభుత్వం అమెరికా అనుకూల విదేశాంగ విధానాన్ని అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ,సామ్రాజ్యవాదం వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించడానికి సిపిఎం కృషి చేస్తుందన్నారు.రాష్ట్రాల హక్కులను సమాఖ్య తత్వాన్ని రక్షించడం కోసం, పార్టీ అన్ని శక్తులను కలుపుకొని కృషి చేస్తుందన్నారు కేరళలోని ఎల్. డి. ఎఫ్ ప్రభుత్వ రక్షణ కోసం పార్టీ నిలబడి ఆ ప్రభుత్వం చేపడుతున్న ప్రజానుకూల విధానాల అమలు బలపరచాలన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం కోసం పార్టీ కృషి చేస్తుందని చెప్పారు వాపక్ష ప్రజాతంత్ర కార్యక్రమాన్ని ప్రత్యామ్నాయంగా ముందుకు తేవాలని, సోషలిజానిదే భవిష్యత్తు అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమచరిత్ర విశిష్టత అనే అంశం పై సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ క్లాసు బోధించారు.తరగతులకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల కోడం రమణ జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు, సూరం పద్మ గురజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్,శ్రీరాములు రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రామడుగులో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం

- మూడు రైతు వేదికల్లో రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం



**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 16**
రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 1031 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన లాంచింగ్ ను ప్రారంభిస్తూ, వానాకాలం సీజన్‌కు రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమం రామడుగు మండలంలోని మూడు రైతు వేదికలైన రామడుగు, గుండి-గోపాలరావుపేట, రంగసాయిపల్లి రైతు వేదికలలో దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. రామడుగు రైతు వేదికలో

మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, తహసీల్దారు రాజేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారిణి సుమాంజలి, క్లస్టర్ రైతులు, రంగసాయిపల్లి రైతు వేదికలో కొక్కెరకుంట పాక్స్ ఛైర్మెన్ మురళికృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారిని త్రివేదిక ప్రసన్న కుమార్, రమేష్, రమ్యలు, క్లస్టర్ రైతులు, గోపాలరావుపేట రైతు వేదికలో ఎంపీడీవో రాజేశ్వరి, మార్కెట్ వైస్ చైర్మన్ పిండి సత్యం రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు అనంత్, సంపత్, ప్రజా ప్రతినిధులు, రైతులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై హర్షం వ్యక్తం చేశారు.

## గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 23 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 16**
ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## బైక్ ప్రమాద మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

**బాధితునికి బాసటగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 16**
రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన అనిల్ బైక్ ప్రమాదంలో మృతి చెందగా సోమవారం అనిల్ కుటుంబాన్ని పరామర్శించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం 38 లక్షల రూపాయల టాటా హెల్త్ ఇన్సూరెన్స్ చెక్కును వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా టాటా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి ముదిరాజ్, కాడే శంకర్, తాజా మాజీ సర్పంచ్ కోల రమేష్, వీర్ల నర్సింగరావు, అంజనీ ప్రసాద్, మాజీ జెడ్ పి కో ఆప్షన్ సభ్యుడు శుక్రుద్దీన్, జక్కుల బాబు, సుధీర్, జవ్వాజి అజయ్ %-% మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న,అమలవుతున్న కార్యక్రమాలపై న్యూఢిల్లీ బృందం. ఆరోగ్య సేవల గురించితెలుసుకోవడం జరిగింది

**ఖానాపురం జూన్ 16 (ప్రజా తీర్పు)**
జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అశోక్ నగర్ 1 సెంటర్లో ఎన్క్వాస్ వర్చువల్ అసెస్మెంట్ ప్రోగ్రాం జరిగింది నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ న్యూఢిల్లీ బృందం అసెస్మెంట్ చేసింది. జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు ఇది ప్రజారోగ్య సౌకర్యాలలో ఆరోగ్య సంరక్షణ నాణ్యతను మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం రూపొందించిన ప్రమాణాల సమితి ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల గురించి అసెస్మెంట్ వర్చువల్ గా చేయడం జరిగింది ప్రజలకు అందుచున్న క్వాలిటీ ఆరోగ్య సేవలు అమలవుతున్న తీరు గురించి తెలుసుకోవడం జరిగింది అందించాల్సిన సేవల గురించి సవివరంగా సూచించడం జరిగింది. దేశంలో కొన్ని సెంటర్లను సెలెక్ట్ చేసి అందులో భాగంగా క్వాలిటీ అత్యుత్తమ సేవలు అందించిన సెంటర్లకు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది.అందులో భాగంగా అశోక్ నగర్ వన్ సెంటర్ ను సెలెక్ట్ చేసి ఉప కేంద్రం ద్వారా అందుతున్న ఆరోగ్య సేవలు గర్భిణీ స్త్రీల సేవలు ప్రసవానంతర సేవలు కుటుంబ నియంత్రణ సేవలు వ్యాధి నిరోధక టీకాలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ టిబి,లెప్రసీ మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా మెదడువాకు ఫైలేరియా లాంటి కార్యక్రమాల మీద సేవలు అందుచున్న విధానాన్ని తెలుసుకోవడం జరిగింది.తెలుసుకున్న విషయాలను ఈ బృందం సెంట్రల్ హెల్త్ మినిస్టర్ కి పంపించడం జరుగుతుంది.డాక్టర్స్ సి హెచ్ ఓ ఏఎన్ఎం ఆశా లనును అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి డాక్టర్ రాకేష్ నేషనల్ హెల్త్ మిషన్ డిస్టిక్ ప్రాజెక్ట్ ఆఫీసర్ అర్చన నేషనల్ హెల్త్ మిషన్ డిస్టిక్ కోఆర్డినేటర్ అనిల్ కమ్యూని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి రాజయ్య ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాస చారి హెల్త్ సూపర్వైజర్ దామోదర్ రెడ్డి,ఏఎన్ ఏం లు సునీతజి రమాదేవి,రమ్య, విజయ,విజయరాణి,భార్గవి , హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్ రెడ్డి గౌడిశాల భాస్కర్ ఆశాలు భారతి,కవిత,కౌసల్య శ్రీలత,సుజాత,కావేరి పార్వతిజి మొదలగు వారు పాల్గొన్నారు.





## గిరిజన గ్రామాలలో విద్యాభివృద్ధి జరగాలి

- 212 బెటాలియన్ ఆధ్వర్యంలో ఆదివాసి ప్రజలకు చేయూత

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 16**
గిరిజన ప్రజలు విద్యను అభ్యసించి సమాజంలో జరుగుతున్న మార్పులను గుర్తించి ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలని 212 బెటాలియన్ కమాండెంట్ దీపక్ కుమార్ కోరారు. సోమవారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం కింద పలు గిరిజన గ్రామాలకు దుప్పట్లు చీరలు టెలివిజన్ రేడియోలతో పాటు వాటర్ ట్యాంకులను 2012 బెటాలియన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రజలు పట్టణాలతో అనుసంధానం అవ్వాలని ఆర్థికంగా అభివృద్ధి జరగాలని కోరారు. సిఆర్పిఎఫ్ పోలీసులకు ఆదివాసి ప్రజలకు మధ్యలో ఉన్న అనుమానాలను గుర్తించేస్తూ వారి మధ్య పెంచేందుకు సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదివాసి గ్రామాల అభివృద్ధికి బెటాలియన్ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఆఫీసర్స్ మనోజ్ కుమార్ రోహిత్ శుక్ల తదితరులు పాల్గొన్నారు



## పులి ఆంజనేయులు గౌడ్ ను ప్రమార్శించిన ఎమ్మెల్యే

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 16**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తండ్రి పరుశురాం గౌడ్ అనారోగ్యంతో మృతిచెందిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదివారం ఉదయం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పరుశురాం గౌడ్ సాధారణ ప్రజలతో మమేకమై ఉండే మంచి మనిషి అని, ఆయన మృతితో పులి ఆంజనేయులు కుటుంబానికి తీరని లోటు వాటిల్లిందని పేర్కొన్నారు. వారి సేవలను ఎప్పటికీ మరచిపోలేమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే దుఃఖ సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కూడా అక్కడికి చేరుకుని తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, బొమ్మరవేణి తిరుపతి ముదిరాజ్, కోల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ

- మొత్తం 100 మందికిపైగా నష్టపరిహారం చెక్కులు అందజేత
- వేములవాడ లో కూల్చివేతలను పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్, వేములవాడ జూన్ 16**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటిదాకా వేములవాడలోని 100కి పైగా మందికి చెక్కులు అందజేసినట్లు ఆర్డీవో తెలిపారు. వేములవాడ లోని ఇంకా చాలా మంది నష్టపరిహారం చెక్కులు తీసుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆర్డీవో చెప్పారు.

**కూల్చివేత పనుల పరిశీలన**

వేములవాడలోని తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం దాకా చేపడుతున్న కూల్చివేత పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాధా బాయి, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 307 దరఖాస్తులు

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 16)**
సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి 307 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు బదిలీ చేశారు.



## ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల
- రామడుగు మోడల్ స్కూల్‌లో పాఠ్య పుస్తకాల పంపిణీ

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు, జూన్ 16**

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్ అన్నారు. రామడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సోమవారం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన సమయానికి పాఠ్యసామగ్రి అందేలా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. విద్యను ప్రోత్సహించడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని వారు తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పుస్తకాలు కేవలం చదువుకే కాదు, మన భవిష్యత్‌కు బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు మనోబలంతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, దేవరాజు నాగరాజు, శ్రీనివాస్, విద్యా కమిటీ చైర్మన్ మామిడి జల, రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రపంచ వయోవృద్ధుల పై వేధింపుల నిరోధక దినోత్సవం

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 16)**

ప్రపంచ వయోవృద్ధుల పై వేధింపుల నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి శ్రీ కె వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ని ప్రభుత్వ వయోవృద్ధుల వసతి గృహం లో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు, రోజు రోజుకు వయోవృద్ధుల పై వేధింపులు పెరిగిపోతుండటం చాలా బాధాకరం అని, ఈ రోజు మనం ఈ స్థితిలో ఉన్నామంటే మన పెద్దలు మరియు వయోవృద్ధుల సలహాలు మరియు మార్గనిర్దేశం వలన నే అని తెలియజేశారు. ఈ సందర్భంగా ఏ విధమైన న్యాయ సలహాలకైనా సమస్యకైనా కూడా దేశంలో ఎక్కడ ఉన్నా కూడా ఈ విధమైన న్యాయ సమస్యకైనా కూడా టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేసి సహాయం పొందవచ్చును. ఇట్టి కార్యక్రమంలో జడ్జితో పాటు లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, వయోవృద్ధుల గృహ నిర్వాహకురాలు రాధిక పాల్గొన్నారు.



## కామ్రేడ్డి యాకయ్య మరణం పార్టీకి తీరని లోటు ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి పెద్దాపురం రమేష్

**నర్సంపేట జూన్ 16 (ప్రజాతీర్పు)**

నర్సంపేట డివిజన్ కమిటీ సభ్యుడు, జ్యోతిబాస్ నగర్ నాయకుడు కామ్రేడ్ కుక్కల యాకయ్య ఆకస్మిక మరణం పేద ప్రజల ఉద్యమాలకు తీరని లోటు అని ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి పెద్దాపురం రమేష్ అన్నారు. పట్టణంలోని జ్యోతి బ సు నగర్ లో ఆరోగ్యంతో మరణించిన కామ్రేడ్ కుక్కల ఐలయ్య స్వగృహంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు యాకయ్య మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబూరావు, వంగాల రాగసుధ, యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి వెంకన్న డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్, ఏఐసిటి యు జిల్లా అధ్యక్షుడు ఎండి మాషిక్ నాయకులు రాజమౌళి, సదానందం, సురేష్ మల్లేశం జ్యోతిబసు నగర్ కాలనీ వాసులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలి




**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 16)**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి తల్లి దండ్రులు ముందుకు రావాలని ప్రభుత్వ పాఠశాలలో పోటీ పరీక్షలలో అర్హత సాధించిన ఉపాధ్యాయులు మంచి బోధన అందిస్తారన్న విషయం తల్లి దండ్రులు గ్రహించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి మండలం కమాన్ పూర్ గ్రామంలో ఉపాధ్యాయులు తల్లి దండ్రులు గ్రామస్తులతో కలిసి సు డా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు ఇస్తున్న ప్రోత్సాహాలను తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్ని వసతులతో పాటు మధ్యాహ్న భోజనం కూడా అందిస్తుందని, ప్రైవేట్ పాఠశాలలో చదివితేనే బాగా చదువుకుంటారన్న అపోహను వీడాలని నరేందర్ రెడ్డి సూచించారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు నరేందర్ రెడ్డి బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆనందం, హెడ్ మాస్టర్ నారాయణ స్వామి, ఉపాధ్యాయురాలు సుధారాణి స్థానిక నాయకులు స్వామి గౌడ్, మడుపు మోహన్, శ్రవణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో సౌదా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ నియమకాల ప్రక్రియ

### నిలిపివేయాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ వినతిపత్రం.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 16,**



గత నాలుగు రోజులుగా కొత్తగూడెంలో సింగరేణి వీకే ఓసి పేరుతో సౌదా కంపెనీ నిర్వహిస్తున్న సింగరేణి ఓబికి డ్రైవర్స్ ఆపరేటర్స్ హెల్పర్లు సూపర్వైజర్లు కావాలని ఉద్యోగాల ప్రక్రియ ప్రైవేటు యజమాన్యల రూపంలో తీసుకుంటుందనీ తక్షణమే ఈ నియామకాల ప్రక్రియను ఆపాలని కోరుతూ ఈరోజు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ సమావేశం ఐ ఎఫ్ టి యు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్,శివ,మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి సి నాయకులు ఆల్బర్ట్, హెచ్ఎంఎస్ నాయకులు గడిపల్లి కృష్ణ ప్రసాద్, సిఐటియు భూక్య రమేష్ ఐ ఎఫ్ టి యు గౌని నాగేశ్వరరావు టియుసిఐ సతీష్ టి ఎన్ టి యు సి రవి గౌడ్ బి ఎం ఎస్ రఘు ప్రసంగిస్తూ ఇలా బయోడేటా స్వీకరించి ఈ సౌదా కంపెనీకి ఎలాంటి రిజిస్ట్రేషన్ నెంబర్ లేదు ఆ కంపెనీ నుంచి ఒక రెస్పాన్సిబిలిటీ ఉన్నటువంటి వ్యక్తి కూడా ఇక్కడ లేదు దీనితో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి గతంలో అనేక కంపెనీలు ఆయా ఓబి లలోనే కార్మికులను ఇంటర్వ్యూ చేసి తీసుకునేది కానీ అందుకు విరుద్ధంగా ఈ సౌధ కంపెనీ నిర్వహిస్తున్న బయోడేటా ఇంటర్వ్యూల ఉద్యోగాల నియమకాల విషయంలో అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నాం. 600 మంది కార్మికులు గత ఓసీ లో పనిచేశారు. ఇప్పుడు కొత్తగా సౌదా కంపెనీ అవి విస్మరించి సింగరేణి బి-రిజిస్టర్ చూడకుండా కొత్తగా బయోడేటాలు ఇంటర్వ్యూలు స్వీకరించడంలో అంతర్యేమిటో అర్థం కావడం లేదు. తక్షణమే సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని ఈ సౌదా నిర్వహిస్తున్న ఉద్యోగాల ప్రక్రియను నిలిపివేయాలని సింగరేణి బి-రిజిస్టర్ ప్రకారం పాత వారికి ఉద్యోగాలు ఇప్పించాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీగా సౌదా కంపెనీ ఆఫీస్ నందు వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిన్ని,ఆంజనేయులు, శివ,మోహన్,వాసు,దినేష్ గౌడ్,అశోక్ , శ్రీనివాస్, ఆసిఫ్,ఎం రవి,అఫీతుల, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉపాధ్యాయుడు



**బానోతుసత్యజ్యోత్ (ప్రజాతీర్పు ప్రతినిధి జమ్మికుంట): జూన్ :16: సోమవారం:**

బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున జిల్లా ఉన్నత పాఠశాల పర్ల పెల్లి, భూపాలపల్లి జిల్లా లో హిందీ పండిట్ గా పనిచేస్తున్న భానోత్ సత్య జ్యోత్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తన కుమారుడు బానోతు సుశాంత్ నాయక్ ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల( బాలురు) జమ్మికుంట లో ( 9).వ తరగతిలో అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలపై నా కున్న నమ్మకముతో నేను నా కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేస్తున్నానని, జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి విద్యాభివృద్ధి కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల పై నమ్మకం, విశ్వాసం పెంపొందించడంతో నేనుఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తీసుకున్న నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం , ఉపాధ్యాయుడు సత్య జ్యోత్ ను అభినందించినారు. గతంలో కూడా, ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన ఇద్దరు కుమారులు. ప్రజ్వల్,ఆదర్శలను, ఇదే. పాఠశాలలో జాయిన్ చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం తో పాటు తదితరులు పాల్గొన్నారు..

## కేజిబివి పాఠశాలలలో టీచింగ్ పోస్టులకు ఖాళీల భర్తీ

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 16)**

కరీంనగర్ జిల్లాలోని కేజిబివి పాఠశాలలలో ఖాళీ గల టీచింగ్ పోస్టులకు (కాంట్రాక్టు) పద్ధతిన 2023 సంవత్సరములో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు అయినవారి నుండి రోస్టర్ కామ్ మెరిట్ ప్రకారము సెలెక్ట్ చేయబడును. %జ=ు (దీఅశీ. ూఎఱ.)-1, జ=ు (ూష్ట్రవ.ూఎఱ.)-2. జ=ు (ూశీఎఱష్ట్రశ్రీ)-1, ూజు-2, ూ+జ=ు (ువశ్రీబస్త్రబ)-1, ూ+జ=ు(జఱజఱఎం%)-1 పోస్టులు భర్తీ చేయుటకు గాను రోస్టర్ కం మెరిట్ ప్రకారం 1:3 రేషియో పద్దతిన ఫోన్ కాల్ లేదా మెసిజ్ ద్వారా పిలువబడును మరియు %ష్ష్ష.ఝతీఱఎఱఝస్త్రుతీవశీ.ఓశీఎ% వెబ్సైట్ నందు పెట్టబడును. కావున సంబంధిత అభ్యర్థులు అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు (2) అటెస్టెడ్ జిరాక్స్ సెట్స్ మరియు పాస్పోర్ట్ సైజ్ (3) ఫోటో లతో జూన్ 18 న ఉదయం 11 గంటలకు కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయమునందు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి కరీంనగర్ ఒక ప్రకటనలో తెలిపారు.



## గంభీరావుపేటలో పేకాట రాయళ్లు అరెస్టు

- 8200 నగదు, పేకాట ముక్కలతో పాటు, మూడు సెల్ ఫోన్లు రెండు బైకులు స్వాధీనం

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్,గంభీరావుపేట జూన్ 16**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టు పడగా వారి వద్ద 8200 నగదు పేకాటముక్కలు రెండు ద్విచక్ర వాహనాలు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ప్రేమానంద్ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నర్సింగరావు పురం స్వామి ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. ఎస్ఐ తన సిబ్బందితో యుక్తంగా పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో నర్సింగరావు పురం స్వామి, మొహమ్మద్ అమీర్, పెంటం శంకర్, నాగారపు రాజు లు పట్టుపడ్డారు. వీరి వద్ద 8200 నగదు తో పాటు, ఆటకు ఉపయోగించిన పేకాట ముక్కలు, రెండు ద్విచక్ర వాహనాలు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవున్నారు. అలాగే మీ మీ ప్రాంతంలో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించవలసిందిగా కోరుతూ, సమాచారం అందించిన వారి పేర్లు గోపయ్యగా ఉంచబడతాయని ఎస్ఐ తెలిపారు.

# అమాయక రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కు పాదం మోపాలి

- అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 16,**



జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా ఎస్పీ కార్యాలయలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధి కారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని ఇన్స్పెక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి డా. గడ్డం వివేక్ గారి కార్యాలయం సందర్భం రైతు నేస్తం కార్యక్రమం

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 16**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారు రైతుల పక్షంలో నిలబడి, రాష్ట్రాన్ని వ్యవసాయ ఉద్ధరణ దిశగా నడిపిస్తున్న దృఢ సంకల్పాన్ని రైతు నేస్తం కార్యక్రమంలో మరోసారి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారి ఉద్గారాలు రాష్ట్ర రైతాంగానికి ఆశాజ్యోతి నూర్చాయి. ఈ సందర్భం గురించి తెలంగాణ కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి గారు స్పందిస్తూరైతుల ఆశీర్వాదంతోనే ప్రభుత్వం ఏర్పడ్డదని రైతే నిజమైన రాజు అని సీఎం గారి ఆలోచనలు, నిర్ణయాలు రైతును కేంద్రంగా ఉంచుకొని రాష్ట్రాభివృద్ధికి,దారితీస్తున్నాయి. ఇది నిజమైన ప్రజా ప్రభుత్వం. రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయినా, రైతులకు 9 రోజుల్లో 9 వేల కోట్లు విడుదల చేసిన ఘనతఈ ప్రభుత్వానిదే మంత్రి వివేక్ వెంకటస్వామి గారు ముఖ్యమంత్రి గారి ప్రసంగంలోని పలు కీలక పాయింట్లను గుర్తుచేశారు:గత ప్రభుత్వ పాలనలో రైతులను అప్పుల్లో ముంచారని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ద్వారా ఆత్మగౌరవంతో జీవించే మార్గం సిద్ధమవుతోందని పేర్కొన్నారు.సన్న వడ్లకు ?500 బోనస్‌తో పాటు సబ్సిడీలతో రైతుకు నేరుగా లాభం కలుగుతుందన్నారు. రైతులకు సోలార్ పంపుసెట్లు, వాణిజ్య పంటల



అవగాహన కల్పించేందుకు కలెక్టర్లను చురుగ్గా పనిచేయమని సీఎంలు ఆదేశించినట్టు తెలిపారు. భూమి రైతుకే గౌరవమని, ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డా. గడ్డం వివేక్ వెంకటస్వామి గారు పాల్గొని ముఖ్యమంత్రి గారి దిశానిర్దేశానికి మద్దతుగా నిలిచారు.

## ఇందిరమ్మ ఇళ్లకు మట్టిని కల్పించాలి చిక్కిరి.శ్రీకాంత్

- ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వాళ్లకు మాత్రమే మట్టిని గ్రామంలో తీసుకునే అవకాశం కల్పించాలి
- తెలంగాణ అసైన్ భూమి సమితి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిక్కిరి.శ్రీకాంత్



**(మహేశ్వరం నియోజకవర్గం ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం కేంద్రం లో గ్రామాలలో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైతే అర్హులుగా ఉన్నారో గుర్తించి వెంటనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి మాత్రమే మట్టిని కూడా సరఫరా చేయాలని మరియు కొంతమంది ఇదే అదనంగా చూసుకొని ఒక్క ట్రాక్టర్ కి 400 నుండి 500 వరకు తీసుకోవడం జరుగుతుంది పూర్తిగా ఇంటి దగ్గరికి వచ్చే వరకి 1500 వరకు ఒక్క టాక్టర్ మట్టికి ఖర్చు వస్తుంది దయచేసి ప్రభుత్వం వెంటనే దీనిపైన గ్రామంలో ఉన్నటువంటి ఇందిరమ్మ ఇల్లు ఎవరైతే నిర్మించుకుంటున్నారో వారందరికీ కూడా గ్రామం లోనుండి మట్టి తీసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు అలాగే ఈ యొక్క దళారులు ఎవరైతే ఉన్నారో.. 500 కు 400 కు మట్టి అమ్ముకుంటున్నారో... బయటి వారికి అమ్ముకునే సరే కానీ ఇందిరమ్మ ఇళ్లకు మాత్రం ప్రభుత్వం సహాయం చేయాలని.. గ్రామంలోనే అవకాశం కల్పించాలని తెలంగాణ అసైన్ భూమి సమితి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిక్కిరి శ్రీకాంత్ తెలియజేశారు

# జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

**(ప్రజా తీర్పు ప్రతినిధి తమ్మికుంట): జూన్ :16: సోమవారం:**



జిల్లాఉపవైద్యఆరోగ్యశాఖఅధికారి డాక్టర్ చందు,వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సోమవారం రోజున ఆకస్మిక తనిఖీ చేసి, తనిఖీ లో భాగంగా ఫార్మసీ రూమ్, ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందు మాట్లాడుతూ....,ఆరోగ్యశాఖ సిబ్బందికి అనేక విషయాలపై దిశా నిర్దేశం చేశారు.(%చీ.జ.ణ%.) క్లినిక్స్ ను పగడ్బందీగా నిర్వహించాలి అందులో ఎన్. సి. డి .పరీక్షలు హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్ ,ఓరల్ క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్, వంటి పరీక్షలు నిర్వహించాలి. లెప్రసి సర్వేను ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించి, ప్రాథమిక దశలో గుర్తించాలి(%ూ.జ.ఖీ ఝఎజూ% )పెట్టి,(%ూజూబ్బఎ ఝఎజూశ్రీవం%) సేకరించాలి. అవసరం అనుకున్న వారికి (%శతీఖఎ%) తీయించాలి. . జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన,ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్ర వారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందులో మహిళలకు అన్నిరకాలపరీక్షలునిర్వహించాలని ఈఅవకాశాన్ని మహిళ లందరూ, సద్వినియోగం చేసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు పైన ప్రజలకు అవగాహన కల్పించాలని,సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ( %ూదీనాూ%) కార్డ్స్ ను ఇంప్రూవ్ చేయాలని ప్రజలందరూ.. ప్రభుత్వ వైద్యాన్నివినియోగించుకోవాలని డాక్టర్ చందు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ , హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్వైజర్ సదానందం,ఫార్మసిస్ట్ శ్రీధర్,ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, తో పాటు తదితరులు పాల్గొన్నారు

# స్వాతంత్ర సమరయోధుడు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**కొప్పురపు రాజిరెడ్డి ప్రజా తీర్పు ప్రతినిధి బెజ్జంకి**



మండల కేంద్రంలోని చిలాపూర్ గ్రామానికి చెందిన స్వతంత్ర సమరయోధుడు కొప్పురపు నారాయణరెడ్డి ఆదివారం అనారోగ్యంతో స్వగ్రామంలో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. స్వతంత్ర పోరాటం పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించి మహనీయులతో కలిసి పోరాడిన వ్యక్తి అని ఎమ్మెల్యే కొనియాడారు. మాజీ ఆప్కాబ్ చైర్మన్ దేవిశెట్టి శ్రీనివాస్ రావు కుటుంబాన్ని పరామర్శించారు నారాయణ రెడ్డికి ముగ్గురు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.గతం లొ రేగులపల్లి గ్రామ పట్వారి గాపని చేశారు. ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ అధ్యక్షుడు ముక్కిసినకర్ రెడ్డి, చానకొండ శరత్, మొండయ్య పాల్గొన్నారు.



## కుటుంబాన్ని ఆదుకోండి...

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 16)**

గత నెల లో జరిగిన ఆక్సిడెంట్ లో మరణించిన స్వర్ణకారుడు తిప్పర్తి కృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు రావుల శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల వద్ద సేకరించిన 1,34,000 (లక్ష ముప్పై నాలుగువేల రూపాయలు) కృష్ణ కుమారుడు అఖిల్ (11) పేరు పై ఫిక్స్ చేసిన బాండ్ పేపరను సంఘ భవనం లో అందజేశారు. ఈ సందర్భంగా. అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతు ఆ కుటుంబానికి మా సంఘం అండగా ఉంటుంది. అలాగే ప్రభుత్వం నుండి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా, పట్టణ, నాయకులు పాల్గొన్నారు.



## ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 16**

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు, రామడుగు మండల కేంద్రంలోని తాటి వన సమీపంలో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్లను సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు కర్ణ శ్రీను, పొన్నం మల్లేశం, బత్తిని లక్ష్మణ్, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ గౌడ్, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లు బాగు చేయాలని ప్రజావాణిలో వినతి

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 16)**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ మారుతి నగర్ లోని రోడ్ల పరిస్థితిని వివరిస్తూ ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కి వినతి పత్రం అందజేయడం జరిగిందని మారుతినగర్ నివాసులు హోమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి మా కాలనీలోని రోడ్లు అధ్వానంగా మారి అనేక ఇబ్బందులకు గురవుతున్నాము. వర్షాకాలం వచ్చిందంటే మా కాలనీ ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. ఇది ఇలా ఉంటే 30 రోజుల క్రితం కొత్త నల్ల పైపులైన్ల కోసమని తవ్వి నల్ల కనెక్షన్స్ ఇచ్చి సరిగ్గా పూడ్చకపోవడం వల్ల మా సమస్యలు రెట్టింపు అయ్యాయి. మా రోడ్ల పరిస్థితిని గమనించి , కొత్త రోడ్ మంజూరు చేయాల్సిందిగా , అది సాధ్యం కాదనుకుంటే రోడ్లకు మరమ్మత్తులు చేసి, సమస్య పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ధనపురి సాగర్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## కన్నాల గ్రామ శివారులో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలి

### ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 16**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లోని ఎం సి పి ఐ పార్టీ ఆఫీసులో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పశులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గం లోని కన్నాల శివారులో అప్పటి బి ఆర్ ఎస్ పార్టీ నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ల ఇండ్లను అర్హులైన నిరుపేదలకు అందించాలని రెండు సంవత్సరాలుగా కొన్ని వందల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని వానకు తడిసి ఎండకు ఎండి పెచ్చులు ఊడిపోతున్నా కూడా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోకపోవడం అనేది చాలా సిగ్గుచేటు గుంట జాగ కూడా లేని నిరుపేదలు ఎంతో మంది బెల్లంపల్లి పట్టణంలో ఉన్నారని అసలైన నిరుపేదలను గుర్తించి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. ఆ యొక్క డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయని వెంటనే బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంచిర్యాల జిల్లా కలెక్టర్ బెల్లంపల్లి ఆర్డీవో స్పందించి రెక్కడితే గాని డొక్కాడని నిరుపేదలు ఉన్నారని వారికి వెంటనే ఆ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని, లేని ఎడల ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు

# ఒరిస్సా టు వేములవాడ గంజాయి తరలిస్తూ ముగ్గురు యువకులు పట్టివేత

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్, వేములవాడ జూన్ 16**



రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై ఒరిస్సా టు వేములవాడకు గంజాయి తరలిస్తూ కరీంనగర్ పోలీసులకు పట్టుపడ్డారు.వేములవాడ రూరల్ మండలం నాగయ్య పల్లికి చెందిన గుంటి నగేష్, కోనరావుపేట మండలం వట్టిమల గ్రామానికి చెందిన చెప్యాల సాత్విక్, వేములవాడ అర్బన్ కాలనీ కి చెందిన కూతడి భరత్ కుమార్ (చింటూ)అనే ముగ్గురు గంజాయికి బానిసైన యువకులు ఎలాంటి కష్టం లేకుండా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒరిస్సాకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా కొత్తపల్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తూ పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. కెటిఎమ్ బైక్ పై ఒరిస్సా కి వెళ్లి 5 కిలో గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా తిమ్మాపూర్ మం కొత్తపెల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడినట్లు సిఐ తెలిపారు. గంజాయి తాగుడుకు బానిస అయిన ముగ్గురు నాలుగు రోజుల క్రితం టూ వీలర్ పై వెళ్లి తిరిగి వస్తుండగా పోలీసులకు పట్టుబడగా 1,25,000 విలువగల ఐదు కేజీల గంజాయితో పాటు బైక్ ని మొబైల్ ని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సిఐ తెలిపారు. వాహన తనిఖీల్లో ఎల్ఎండి ఎస్ ఐ శ్రీకాంత్ గౌడ్ పోలీసులు పాల్గొన్నారు.పక్కా సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్న పోలీసులను సిఐ సదన్ కుమార్ అభినందించారు.



## పసిడి కొనుగోలుదారులకు ఊరట.. ధర ఎంత తగ్గిందో తెలుసా..?

పసిడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. అంతర్జాతీయంగా బలహీనమైన డిమాండ్ కారణంగా రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్స్ బంగారం ధర రూ.170 తగ్గి తులానికి రూ.1,01,370కి చేరుకుంది. 22 క్యారెట్స్ బంగారం ధర రూ.150 తగ్గి.. రూ.1,00,550కి చేరుకుంది. వెండి ధర రూ.1,000 పతనమై.. కిలోకు రూ.1,07,100కి చేరింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. ఫ్యూచర్స్ ట్రేడ్‌లో మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (%వీజశ%)లో ఆగస్టు నెలలో అత్యధికంగా ట్రేడ్ అయిన బంగారం కాంట్రాక్ట్ పది గ్రాములకు రూ.358 తగ్గి రూ.99,918 వద్ద ట్రేడవుతోంది. ఎంసీఎక్స్‌లో ఉదయం సెషన్‌లో 10 గ్రాములకు రూ.802 పెరిగి ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి రూ.1,01,078కి చేరుకుంది. భారతదేశం-యూఎస్, భారతదేశం-చైనా, యూఎస్-యూరోపియన్ ప్రాంతాల మధ్య అనేక సంభావ్య వాణిజ్య ఒప్పందాల వార్తల తర్వాత లాభాల బుకింగ్ కనిపించిందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ (కమోడిటీ అండ్ కరెన్సీ) జతిన్ త్రివేది తెలిపారు. దాంతో బంగారం దాదాపు రూ.99,800 పరిధిలో పరిమిత పరిధిలో ట్రేడవుతోంది. సురక్షిత పెట్టుబడికి డిమాండ్ లేకపోవడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం స్వల్పంగా మెరుగుపడింది. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ ఔన్సుకు 13.23 డాలర్లు తగ్గి ఔన్సుకు 3,419.41 డాలర్లకు చేరుకుంది. అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా మాట్లాడుతూ బంగారం ధరలో స్వల్ప మెరుగుదల ఉన్నప్పటికీ.. అది రికార్డు స్థాయిలోనే ఉందని చెప్పారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా పసిడి పెట్టుబడిదారులు బంగారం వైపు దృష్టి పెడుతున్నారన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న అనిశ్చితి బులియన్ ధరలకు మంచి మద్దతునిస్తుందని వ్యాపారులు నమ్ముతున్నారని మెహతా అన్నారు. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా ప్రకారం%ౌ% ఈ వారం పెట్టుబడిదారులు యూఎస్ ఫెడరల్ బ్యాంక్ ద్రవ్య విధానం.. వివిధ నిర్ణయాలపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం జరిగే సెంట్రల్ బ్యాంక్ సమావేశం వడ్డీ రేట్లను తగ్గించడం గురించి మార్గదర్శకత్వం అందిస్తుందని ఆయన అన్నారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 22 క్యారెట్ల పసిడి రూ.93,050 ఉండగా.. 24 క్యారెట్ల పుత్తడి రూ.1,01,510 ధర పలుకుతుంది. ఇక కిలో వెండి ధర రూ.1,19,900 పలుకుతున్నది.



## పశ్చిమాసియా సంక్షోభంతో పెరుగుతున్న ముడి చమురు ధరలు.. భారత కంపెనీలపై ఒత్తిడి..!

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం భారత చమురు మార్కెట్‌తో పాటు గ్యాస్ కంపెనీలపై ఆర్థికంగా ఒత్తిడి పడే అవకాశం ఉన్నది. ఐఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్‌కు 73 డాలర్ల నుంచి 74 డాలర్ల వరకు ఉన్నది. అయినప్పటికీ.. చమురు మార్కెట్ కంపెనీల (%ూవీజం%) ఆదాయంపై ప్రభావితమవుతున్నది. అదే సమయంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నది. అప్‌స్ట్రీమ్ కంపెనీలు చమురు, గ్యాస్ పరిశ్రమ ప్రారంభ భాగంలో పని చేస్తుంటాయి. భూమి నుంచి చమురు, గ్యాస్‌ను వెలికితీసే ప్రక్రియ. ఇది గ్యాస్ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. ఎల్ఎన్‌జీ (%ూచీ+%) ముడి చమురుకు సంబంధించింది. ముడి చమురు ధర పెరిగితే.. ఎల్ఎన్‌జీ ధర సైతం పెరుగుతుంది. చమురు ధరల్లో ఈ పెరుగుదల ఇప్పటికీ 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పెరుగుదల కంటే తక్కువగా ఉందని పేర్కొంది.

# ప్రగతి నగర్ 1 సంక్షేమ సంఘం ఎన్నికలలో 55 ఓట్ల మెజారిటీతో మాచర్ల విష్ణు ఘనవిజయం

- బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా
- ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన మాచర్ల విష్ణు

**కూకట్ పల్లి, జూన్ 16 (ప్రజాతీర్పు)**

శేరిలింగంపల్లి నియోజక వర్గం, కూకట్ పల్లి డివిజన్ పరిధిలో గల ప్రగతి నగర్ 1 సంక్షేమ సంఘం ఎన్నికలు ఆక్స్ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ లో సోమవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్ష పదవికి మాచర్ల విష్ణు, మండల సువర్ణ, కవిత లు పోటీ చేశారు. బస్తీలో మొత్తం 161 పోలయ్యాయి. మాచర్ల విష్ణుకు 95 ఓట్లు, కవితకు 40 ఓట్లు, మండల సువర్ణకు 26 ఓట్లు పడ్డాయి. మాచర్ల విష్ణు కవితపై 55 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం మాచర్ల విష్ణు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రగతి నగర్ 1లోగల ఇంటి యజమానులు నన్ను నమ్మి ఓటు వేసినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రగతి నగర్ ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.నన్ను గెలిపించిన ఇంటి యజమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బస్తీలో ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి అట్టి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై ఉంటూ బస్తీ సమస్యలు తెలుసుకుంటానని అన్నారు. అనంతరం కోశాధికారిగా రొక్కం శంకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా లద్ది పీర్ల రఘు గౌడ్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఎల్ దిలీప్ గౌడ్, ఎలక్షన్ కమిటీ సభ్యులు బిక్షపతి, పవన్ కుమార్, నాగేందర్, వీరేశం, శ్రీరాములు, వెంకటేష్, శ్రీనివాస్, వాణి, అనిత, బ్రహ్మం, బాలరాజు, కాలనీ ఇంటి యజమాను తదితరులు పాల్గొన్నారు.



## భద్రతను పెంచే ప్రయత్నంలో భాగంగా సీసీటీవి కెమెరాలు ప్రారంభం – సీఐ నర్సింహా రాజు

**బాలానగర్,జూన్ 16(ప్రజాతీర్పు)**

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరదిలోని జిల్లా పరిషత్ హై స్కూల్, చరబండరాజు నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీకెమెరాలను సోమవారం బాలానగర్ సీఐ నర్సింహా రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసుశాఖ తీసుకుంటున్న వివిధ రకాల చర్యలపై అవగాహన కల్పిస్తుండటం వల్లనే అన్నివర్గాల ప్రజలు ముందుకువచ్చి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. సీసీకెమెరాల ఏర్పాటుకు సహకరించిన విరాళం అందించిన స్థానిక బీజేపీ నేత ప్రమోద్ మోడీని ఈ సందర్భంగా సీఐ అభినందించారు. బాలానగర్ సీఐ నర్సింహా రాజు ప్రకారం, నిఘా వ్యవస్థ నేరాల గుర్తింపును మెరుగుపరచడమే కాకుండా, పోలీసు ప్రతిస్పందనను వేగవంతం చేయడానికి కూడా సీసీటీవీలు వీలు కల్పిస్తాయన్నారు. ప్రజా భద్రతను బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా, ఇటీవల వివిధ కలనిలో కొత్త సీసీటీవి కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సరితా రెడ్డి, స్కూల్ ప్రైనిసిపల్ అరుణ్ జ్యోతి, ప్రమోద్ మోడీ, కిరణ్, శివరాంజని స్థానికులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పథకం పనుల తీరు పై భారత ప్రభుత్వ NREGS డైరెక్టర్ శివశంకర్ తో చర్చించిన జిల్లా కలెక్టర్ కె హేమావతి.

**సిద్దిపేట జిల్లా,( జూన్,) ప్రజా తీర్పు ప్రతినిధి**

జిల్లాలో ఈరోజు, రేపు, ఎల్లుండి 3 రోజుల పాటు %వీచీ=జు+ూ% పనుల పరిశీలనలో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వ %వీచీ=జు+ూ% డైరెక్టర్ శివ శంకర్ నేతృత్వంలోని బృందం కుకునూరు పల్లి మండలంలోని ముద్దాపూర్, కుకునూరుపల్లి మరియు కొండపాక గ్రామంలో లలో పర్యటించి ముద్దాపూర్ లో ఫిష్ పాండ్, కుకునూర్ పల్లి లో భూమి చదును పనులు, కొండపాకలో భూమి చదును మరియు మొరం రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం మినర్వా హొటల్ లో జిల్లా కలెక్టర్ కే. హైమావతి తో జిల్లాలో పర్యటించిన సందర్భంగా పరిశీలించిన నరేగా ద్వారా చేపట్టిన వివిధ పనుల ప్రగతి పై చర్చించారు. ఈరోజు పరిశీలించిన పనులు సంతృప్తికరంగా ఉన్నాయని పనులన్నీ కూడా ప్రయోజనకరంగా ఉంటాయని ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేర్యాల పెయింటింగ్స్ ను జిల్లా కలెక్టర్ ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ కు అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య తదితరులు ఉన్నారు.



## రైతునేస్తం కార్యక్రమం జయప్రదం చేయండి: KLR

- ఈరోజు సాయంత్రం 4గంటలకు %జవీ% వీడియో కాన్ఫరెన్స్
- మార్కెట్ కమిటీలు, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి.

**(మహేశ్వరం నియోజకవర్గం ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**



రైతునేస్తం ద్వారా %జవీ% రేవంత్ రెడ్డి గారు నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. మహేశ్వరం మార్కెట్ కమిటీ సభ్యులు ఈ వీడియో కాన్ఫరెన్స్ ను విజయవంతం అయ్యేలా చూడాలని కిచ్చెన్న కోరారు.రైతు వేదిక దగ్గర ఏర్పాటు చేసే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహేశ్వరం నియోజకవర్గం రైతులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నేరుగా మాట్లాడుతారని చెప్పారు. కందుకూరు, నేదునూర్, బేగంపేటల్లోని జరిగే రైతునేస్తం ముఖాముఖిలో అన్నదాతలు పాల్గొనాలని లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతు రుణమాఫీ, భరోసా, బోనస్ టెక్నికల్ గా రాని వారు పొలం పాస్ పుస్తకాలు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ లను రైతు వేదిక దగ్గర వ్యవసాయ అధికారులకు అందజేయాలని %ఖూ=% సూచించారు.కర్షకలోకానికి రూ.78 వేల కోట్లు రేవంత్ సర్కార్ ఖర్చు చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న రైతు సంక్షేమాన్ని, సీఎం రేవంత్ రెడ్డి గారి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు.

# లాభ సాటి పంటల సాగు పై రైతులు దృష్టి సారించాలి... సీఎం రేవంత్ రెడ్డి

- సంవత్సరన్నర కాలంలో రైతులు సంక్షేమానికి 70 వేల కోట్ల వ్యయం
- 9 రోజుల వ్యవధిలో రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ
- రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు
- రైతుల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కు ప్రణాళికలు
- రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి కార్యక్రమానికి ఇల్లంతకుంట రైతు వేదిక నుంచి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి హాజరైన జిల్లా కలెక్టర్

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్,ఇల్లంతకుంట జూన్ -16**

లాభ సాటి పంటల సాగు పై రైతులు దృష్టి సారించాలి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి కార్యక్రమానికి ఇల్లంతకుంట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి హాజరయ్యారు. ఆచార్య జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి 1031 రైతు వేదికలో నూతనంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ఇతర మంత్రులు, సీ.ఎస్ కె. రామ కృష్ణా రావు లతో కలిసి ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల ఆశీర్వాదం లేకపోతే ప్రజా ప్రతినిధిగా రాణించలేమని , గ్రామ వార్డు సభ్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరికి రైతు చల్లని చూపులు అవసరమని అన్నారు. గత పాలకులు 4 విడతల్లో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తే రైతులకు మిత్తి మాత్రమే జరిగిందని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని విధ్వంసం చేసి మనకు అప్పగించారని , మనం అధికారంలో వచ్చే సమయానికి రైతుల ధాన్యం కొనలేని పరిస్థితి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించని దుస్థితిలో రాష్ట్రం ఉండేదని, గత పాలకులు వరి వేస్తే ఉరి అనే స్థితి తీసుకొని వచ్చారని అన్నారు.

నేడు ప్రజా ప్రభుత్వంలో చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. పేదలకు సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణి చేస్తున్నామని అన్నారు. వరి పండించడంలో పంజాబ్ హర్యానా రాష్ట్రాలను తెలంగాణ దాటిందని అన్నారు. గత పాలకుల హయాంలో పెండింగ్ పెట్టిన బకాయిలను మెల్ల మెల్లగా చెల్లిస్తున్నామని అన్నారు. ఒక్కొక్క వ్యవస్థను ప్రభుత్వం బాగు చేస్తుందని అన్నారు. 9 రోజులలో రైతులకు 9 వేల కోట్ల ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, 70 లక్షల 11 వేల రైతులకు డబ్బులు బదిలీ చేస్తామని అన్నారు. రైతుల చేతిలో డబ్బులు ఉంటే పెట్టుబడి కోసం అప్పు చేయాల్సిన దుస్థితి రాదని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్తు, రైతు బీమా, పరిహారం, బోనస్ కలిపి మొత్తం 18 నెలలో లక్షా 1 వేయి 728 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. గత పాలకులు చేసిన రుణమాఫీ మనం చేసిన రుణమాఫీ పై గ్రామాలలో చర్చ పెట్టాలని అన్నారు. గతంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని , మనం 8 వేల పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 48 గంటల్లో రైతులకు ఖాతాలో పంట డబ్బులు జమ అయ్యేలా చూశామని అన్నారు. దోపిడిదారులకు ధరణి చుట్టం ఐతే, భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం చేస్తున్నామని అన్నారు. ప్రజల చావుల మీద



అధికారం రావాలని ప్రతిపక్షాలు కుటిల ఆలోచనలు చేస్తున్నాయని అన్నారు. గతంలో ఎప్పుడైనా సీఎం ఫాం హౌస్ దాటి వచ్చారా అని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించామని, గతంలో దళితుల నుంచి ఒక మంత్రి ఉంటే తమ ప్రభుత్వ హయాంలో స్పీకర్ తో కలిసి 5 దళిత సామాజిక వర్గ సభ్యులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సరంలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని, గతంలో నోటిఫికేషన్ల కోసం ఉద్యమాలు చేసిన యువత, నేడు ఆలస్యంగా ఇవ్వమని కోరుతూ ధర్నా చేస్తుందని అన్నారు. సివిల్ సర్వీసెస్ చదువుకునే పిల్లలకు 2 లక్షల రూపాయల సహాయం అందించామని అన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లాభసాటి వ్యవసాయం సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలని అన్నారు. రైతులకు సాంకేతికత బదిలీ చేయాల్సిన అవసరం ఉందని, ఏ.ఐ ద్వారా ఎక్కడ సమస్య ఉందో తెలిస్తే అక్కడే ఎరువులు చల్లితే మనకు తప్పుతుందని, భూసారం పెరుగుతుందని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం 17 వేల కోట్ల రూపాయల చెల్లించిందని, మనం సోలార్ కు మారితే ఈ డబ్బులు ఆదా చేసుకోవచ్చని, మహిళలకు నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు అదనంగా ఆదాయం కూడా లభిస్తుందని, రైతుల భూములలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అంబానీ ఆదానీలతో వారు పోటీపడే విధంగా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు సోలార్ పంప్ సెట్ వల్ల ప్రయోజనం, లాభసాటి పంటల సాగుపై సీనియర్ రైతులతో రైతు వేదిక లలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు జరపాలని అన్నారు. పంట మార్పిడి వ్యవస్థ తప్పనిసరిగా రావాలని, జోన్న రొట్టె తింటే మన ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. వ్యవసాయ ఫీలింగ్ యాక్ట్ తీసుకుని వచ్చి పేదలకు గతంలో ఇందిరమ్మ భూములు పంచి పెట్టిందని, ఆదివాసి గిరిజనులకు పోడు పట్టాలు అందించిందని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ఇందిరమ్మ ప్రభుత్వం 21 వేల కోట్ల రుణ మాఫీ, 13 వేల 88 కోట్ల రైతు భరోసా, క్వింటాళ్ల సన్న బియ్యం 500 బోనస్ క్రింద 1199 కోట్ల, రైతు బీమా క్రింద 2182 కోట్ల రూపాయల, 200 కోట్ల పంట నష్ట పరిహారం, 16, 691 కోట్లతో ఉచిత విద్యుత్ సరఫరా, 11 వేల కోట్లతో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం మొత్తం 70 వేల కోట్ల ఖర్చు చేశామని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన కోటి 49 లక్షల 39 వేల 112 ఎకరాలకు పూర్తి స్థాయిలో రైతు భరోసా డబ్బులను జమ చేసే కార్యక్రమం రైతుల సమక్షంలో నేడు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. 9 రోజుల వ్యవధిలో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని అన్నారు. రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, ఒకటిన్నర సంవత్సర కాలంలో రైతు సంక్షేమానికి 70 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మాత్రమేనని అన్నారు.గతంలో మన్మోహన్ సింగ్, వైయస్సార్ హయాం లో దేశం మొత్తం మీద 70 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, 10 నెలల కాలంలో 21 వేల కోట్ల రుణమాఫీ మన ప్రభుత్వం చేసిందని అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రైతు బంధు బకాయిలు 7625 కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తుంది తెలంగాణ రైతు అని అన్నారు.దేశం మొత్తం తెలంగాణ రాష్ట్ర పాలన కావాలని నేడు కోరుకుంటుందని అన్నారు. ఉచిత విద్యుత్తు ,నీటి పారుదల ప్రాజెక్టు, రుణమాఫీ వంటి అనేక రైతు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వినూత్నంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కృష్ణ, గోదావరి నదులలో రైతులకు అన్యాయం జరిగిందంటే కారణం గత పాలకులదని మంత్రి విమర్శించారు. సీఎస్ కె. రామ కృష్ణా రావు మాట్లాడుతూ, దేశంలో ప్రగతి శీల రైతులు ఉన్న రాష్ట్రం తెలంగాణ, మన రైతులు సంపన్నులు కావాలనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా రైతుల ఆదాయం పెంచెందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ దాదాపు 6 లక్షల మంది రైతులు నేటి కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు.



## 'జెర్సీ మారితేనే లక్ మారుతుంది'.. రాయల్స్‌కు శాంసన్ గుడ్ బై చెప్పేశాడా..!

ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించే సంజూ శాంసన్ తన సాంర్థ్యంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ట్రోఫీ అందించాలని విశ్వ ప్రయ త్నం చేస్తున్నాడు సంజూ. కానీ, అతడి కల నిజం కావడం లేదు. దాం తో%ా% జెర్సీ మారిస్తేనే లక్ మారుతుందని భావిస్తున్నాడు. ఇన్నాళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాజస్థాన్ జట్టును వీడేందుకు సిద్ధమవుతున్నాడు. ఈమధ్య అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతున్న పోస్ట్‌లు అందుకు బలం చేకూ రుస్తున్నాయి. ఇంతకూ సంజూ ఏ ఫ్రాంచైజీ గూటికి చేరనున్నాడో తెలుసా.. చెన్నై సూపర్ కింగ్స్. ఇంటర్నెట్‌లో 'సంజూ రిలీజ్డ్.. సీఎస్కే రెడీ' అంటూ ధోనీ, శాంసన్ నవ్వుతూ ఉన్న పోస్ట్‌లు వైరలవుతున్నాయి. ఆ పోస్ట్‌లు చూసిన వాళ్లంతా శాంసన్.. సీఎస్కే ఫ్రాంచైజీకి ఆడడం ఖాయం అని మస్త్ ఖుషీ అవుతున్నారు.

## చిక్కుల్లో బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్.. ట్రావెల్ బ్యాన్ విధించిన కోర్టు..!



బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబుల్ హసన్ వరుసగా చిక్కుల్లో వ డు తు న్నా డు. ఇప్పటికే చెక్ బౌన్స్ కేసులో అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. నిరుడు డిసెంబర్ నుంచి జట్టుకు దూరమైన అతడు తాజాగా మరోసారి కష్టాల్లో పడ్డాడు. అతడిపై నమోదైన అవినీతి కేసు ను విచారిస్తున్న ఢాకా కోర్టు సోమవారం ఈ ఆల్‌రౌండర్‌కు పెద్ద షాకిచ్చింది. సదరు కోర్టు షకీబ్‌పై ట్రావెల్ బ్యాన్ విధించింది. అతడితో పాటు మరో 15 మందికి కూడా ఈ నిషేధం వర్తిస్తుందని న్యాయస్థానం తెలిపింది. అవినీతి నిరోధక కమిషన్ దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను విచారించిన ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జ్ ఎండీ. జకీర్ హెుస్సేన్ సోమవార తీర్పును వెలువరించారు. స్టాక్ మార్కెట్‌లో అక్రమంగా కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. ఇది స్టాక్ మార్కెట్ నియమావళిని షకీబ్ ఉల్లఘించారు.





## ICC సెప్టెంబర్ 30 నుంచి
# మహిళల వన్డే వరల్డ్ కప్..

ICC సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే వరల్డ్ కప్.. పూర్తి షెడ్యూల్ చూసేయండి..! %×జజ% : ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (%ఔజ%) ఫైనల్ ముగియడమే ఆలస్యం మరో మెగా టోర్నీ అభిమానులను అలరించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (%×జజ%) సోమవారం మహిళల వన్డే వరల్డ్ కప్ షడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (%ఔజ%) ఫైనల్ ముగియడమే ఆలస్యం మరో మెగా టోర్నీ అభిమానులను అలరించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (%×జజ%) సోమవారం మహిళల వన్డే వరల్డ్ కప్ (%ఔశీఎవలం వాణ× ఔశీతీశ్రీస జబజూ%)షెడ్యూల్‌ను విడుదల చేసింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 30న షురూ కానుంది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ ఆరంభం రోజే టీమిండియా బెంగళూరులో శ్రీలంకతో తలపడనుంది. అయితే.. టీమిండియా, పాకిస్థాన్ మ్యాచ్ అక్టోబర్ 5న జరుగనుంది. పహల్గాం ఉగ్రదాడి.. ఆపరేషన్ సిందూర్ (%వాజూవతీఖఅశీఅ వాఱఅఅశీశీతీ%) తదనంతర పరిణామాల నేపథ్యంలో పాక్ మ్యాచ్‌లకు లంక వేదిక కానుందని ఐసీసీ పేర్కొంది. కొలంబోలో ఏకంగా 11 లీగ్ మ్యాచ్‌లకు ఐసీసీ ఆమోదం తెలిపింది. వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టనుంది. సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న భారత్, శ్రీలంకలు ఫేవరెట్లుగా బరిలోకి దిగనున్నాయి. సెప్టెంబర్ 30 లంక, టీమిండియా పోరుతో మెగా టోర్నీ షురూ కానుంది. అనంతరం అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో ఆసీస్ తలపడనుంది. మొత్తంగా కొలంబోలో 11 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అక్టోబర్ 29న కొలంబో లేదా బెంగళూరులో తొలి సెమీ ఫైనల్ జరుగనుండగా.. అక్టోబర్ 30న బెంగళూరులో రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఉండనుంది. టైటిల్ విజేతను నిర్ణయించే ఫైనల్ పోరు నవంబర్ 2న జరుగనుంది. ఈ మ్యాచ్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుందని ఐసీసీ వెల్లడించింది.

### Team India Womens

%అక్టోబర్ 14 %-% న్యూజిలాండ్ %జం% శ్రీలంక %-% కొలంబో
అక్టోబర్ 15 %-% ఇంగ్లండ్ %జం% పాకిస్థాన్ %-% కొలంబో
అక్టోబర్ 16 %-% ఆస్ట్రేలియా %జం% బంగ్లాదేశ్ %-% వైజాగ్
అక్టోబర్ 17 %-% దక్షిణాఫ్రికా %జం% శ్రీలంక %-% కొలంబో
అక్టబోర్ 18 %-% న్యూజిలాండ్ %జం% పాకిస్థాన్ %-% కొలంబో
అక్టోబర్ 19 %-% భారత్ %జం% ఇంగ్లండ్ %-% ఇండోర్
అక్టోబర్ 20 %-% శ్రీలంక %జం% బంగ్లాదేశ్ %-% కొలంబో
అక్టోబర్ 21 %-% దక్షిణాఫ్రికా %జం% పాకిస్తాన్ %-% కొలంబో
అక్టోబర్ 22 %-% ఆస్ట్రేలియా %జం% ఇంగ్లండ్ %-% ఇండోర్

### India

అక్టోబర్ 23 %-% భారత్ %జం% న్యూజిలాండ్ %-% గువాహటి
అక్టోబర్ 24 %-% పాకిస్థాన్ %జం% శ్రీలంక %-% కొలంబో
అక్టోబర్ 25 %-% ఆస్ట్రేలియా %జం% శ్రీలంక %-% ఇండోర్
అక్టోబర్ 26 %-% ఇంగ్లండ్ %జం% న్యూజిలాండ్ %-% గువాహటి
అక్టోబర్ 26 %-% భారత్ %జం% బంగ్లాదేశ్- బెంగళూరు
అక్టోబర్ 29 %-% సెమీ ఫైనల్ %-% గువాహటి /కొలంబో
అక్టోబర్ 30 %-% సెమీ ఫైనల్ 2 -బెంగళూరు
నవంబర్ 2 %-% ఫైనల్ %-% కొలంబో/ బెంగళూరు






## కన్నప్ప చిత్రాన్ని వీక్షించిన రజినీకాంత్..

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. చిత్ర రిలీజ్ మరి కొద్ది రోజులే ఉండడంతో మేకర్స్ మూవీ ప్రమోషన్స్ జోరుగా చేస్తున్నారు. ఇటీవల చిత్ర ట్రైలర్ విడుదల కాగా, ఈ ట్రైలర్ సినీ ప్రియులని ఎంతగానో ఆకట్టుకుంది. మరోవైపు రిలీజ్‌కి ముందే ఈ మూవీ సినీ ప్రముఖుల ప్రశంసలు సొంతం చేసుకుంటుండడం విశేషం. ముఖ్యంగా, సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇటీవల ఈ చిత్రాన్ని వీక్షించి, టీమ్‌ను అభినందించారు. ఈ విషయాన్ని మంచు విష్ణు సోమవారం తన 'ఎక్స్' ఖాతా ద్వారా పంచుకున్నారు. రజనీకాంత్‌తో కలిసి దిగిన ఫోటోలతో పాటు, ఆ మధురానుభూతిని అభిమానులతో షేర్ చేశారు. "రజనీకాంత్ అంకుల్ నిన్న రాత్రి 'కన్నప్ప' సినిమా చూశారు. సినిమా పూర్తయ్యాక ఆయన నన్ను హత్తుకున్నారు. సినిమా చాలా బాగా నచ్చిందని చెప్పారు. ఒక నటుడిగా ఈ హాగ్ కోసం 22 ఏళ్లుగా ఎదురుచూశాను. ఈరోజు నేను ఎంతో సంతోషంగా ఫీల్ అవుతున్నాను. ఆయన నన్ను ఎంకరేజ్ చేసినట్లు అనిపిస్తుంది. కన్నప్ప జూన్ 27న వస్తోంది. ప్రపంచం శివుని మాయాజాలం అనుభూతి పొందేలా చేయడానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చాడు. ఇక సినిమా తరువాత రజినీకాంత్, మోహన్ బాబు కలిసి కేక్ కట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. శైవ భక్తుడైన కన్నప్ప జీవిత కథ ఆధారంగా రూపొందిన కన్నప్ప చిత్రానికి ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. విశిష్టమైన తారాగణంతో ఈ చిత్రం రూపొందగా, ఇందులో ప్రభాస్, మోహన్ బాబు, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి అగ్రతారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఒక్కసారి కట్టిందంటే ఆ శారీని మళ్లీ ముట్టుకోదట.. ఎందుకో తెలుసా.. ?



తెలుగు సినీప్రియులకు ఇష్టమైన హీరోయిన్ స్నేహ. ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఆమె ఒకరు. సంప్రదాయంగా కనిపిస్తూనే అందం, అభినయంతో కట్టిపడేసింది. సహజ నటనతో అడియన్స్ హృదయాలను దొచుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇక కొన్నేళ్ల క్రితమే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన స్నేహ.. యంగ్ హీరోలకు అక్కగా, వదినగా నటిస్తుంది. అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో ముఖ్యమైన పాత్రలు పోషించింది. ఇప్పుడు సినిమాలతోపాటు పలు రియాల్టీ షోలకు జడ్జీగా వ్యవహరిస్తుంది. ప్రస్తుతం చీరల వ్యాపారంలోనూ బిజీగా ఉంటుంది. ఇదిలా ఉంటే.. స్నేహ కట్టిన చీరను మళ్లీ కట్టుకోదట. అందుకు పెద్ద కారణమే ఉందట. గతంలో ఓ మ్యాగజైన్ తన గురించి న్యూస్ రాస్తూ.. ఎప్పుడూ ధరించిన దుస్తులనే ధరిస్తుందని.. ఆమెకు వేరే బట్టలు లేవని రాసిందట. ఆ సమయంలో తన దుస్తులు, డ్రెస్సింగ్ మీద చాలా విమర్శలు వచ్చాయని చెప్పుకొచ్చింది. దీంతో అప్పటి నుంచి ఒక్కసారి కట్టిన చీరను మళ్లీ ముట్టుకోదట. ఇటీవలే స్నేహాలయం పేరుతో చీరల షాపింగ్ మాల్ స్టార్ట్ చేసింది స్నేహ. అలాగే తెలుగు, తమిళంలో పలు చిత్రాల్లో కీలకపాత్రలు పోషిస్తుంది. మరోవైపు సోషల్ మీడియాలో నిత్యం చీరల ఫోటోషూట్స్ షేర్ చేస్తుంటుంది. ఈ ముద్దుగుమ్మకు ఇప్పటికీ విపరీతమైన ఫాలోయింగ్ ఉంది.





### సెట్‌లో ఆ స్టార్ హీరోతో పెళ్లైపోయింది..
## 14 ఏళ్ల తర్వాత అసలు విషయం చెప్పిన జెనీలియా.. ఎవరంటే..

చాలా కాలం తర్వాత ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుంది జెనీలియా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. బాలీవుడ్ హీరోతో సినిమా సెట్ లోనే తనకు పెళ్లి జరిగిందంటూ గతంలో జరిగిన ప్రచారం పై స్పందించింది జెనీలియా. ఆయన వార్తలు ఎవరు సృష్టించారో తనకు తెలుసన్నారు. బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం, తాను గతంలో ఓ ప్రాజెక్ట్ కోసం కలిసి పనిచేశామని.. ఆ సినిమా సెట్ లో అనుకోకుండా తమ పెళ్లి జరిగిందంటూ అప్పట్లో విపరీతమైన ప్రచారం జరిగిందని.. అది కేవలం ప్రచారం మాత్రమే అని.. అందులో ఎలాంటి వాస్తవం లేదని.. తమకు అసలు పెళ్లే జరగలేదని చెప్పుకొచ్చింది. కానీ కొంతమంది పీఆర్ లు ఇలాంటి వార్తలను సృష్టించారని.. కాబట్టి అలాంటి వార్తలు ఎందుకు ప్రచారం చేశారో వారినే అడగాలని తెలిపింది. జెనీలియా, జాన్ అబ్రహం కలిసి పనిచేసిన సినిమా ఫోర్స్, 2011లో విడుదలైన ఈమూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి పెళ్లి జరిగిందనే ప్రచారం నడిచింది. సీన్ లో భాగంగా పంతులుగారు వీరిద్దరికి నిజమైన పెళ్లి చేసేశారని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. ఇదిలా ఉంటే.. మొదటి సినిమాతోనే నటుడు రితేశ్ దేశ్ ముఖ్ తో ప్రేమలో పడింది జెనీలియా. కొన్నాళ్లపాటు ప్రేమలో ఉన్న వీరిద్దరు పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, RNI Reg no. APTEL/2001/5268 printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020